ఖాళీ జాగా.. కనిపిస్తే పాగా

ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేద్దాం అన్నట్లు ఉంది మధురవాడ పరిసర ప్రాంతాల్లో పరిస్థితి. అదీ ప్రభుత్వ భూమి అయితే ఇక వారిదే ఇష్టారాజ్యం. ఎంచక్కా ఆక్రమించేసుకుని, వాడేసుకుంటున్నారు. అంతటితో ఆగకుండా గెడ్డలను కప్పేస్తున్నారు. దీంతో వర్షం నీరు, మురుగు సజావుగా ప్రవహించే వీల్లేక రోడ్లపై ప్రవహిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాలనే కబ్జా చేస్తున్నా .. సంబంధిత శాఖల అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంతో వారి ఆక్రమణలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది.


మారికవలసలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన రోడ్డు

- ఇష్టానుసారం ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రూరల్ మండలంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

మధురవాడ: ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు సొంత సొత్తులా వాడేసుకుంటున్నారు. కొందరు రోడ్లు వేసుకుంటుంటే మరికొందరు ముందు ముళ్లపొదలు తొలగించి, తర్వాత శుభ్రం చేసి వాడుకలోకి తేవడం.. తర్వాత ఆక్రమణ పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. ఇదీ విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం నుంచి కొమ్మాది జంక్షన్ వరకు హైవేను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములతో పాటు ఇతర ప్రాంతాలలో పరిస్థితి. పాత పరదేశిపాలెం, కొత్త పరదేశిపాలెం, డ్రైవర్స్ కాలనీ, బోరవానిపాలెం, మారికవలస ప్రాంతాల్లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు వ్యాపార అవసరాల కోసం వాడేసుకుంటున్నారు. కనీసం గెడ్డలకైనా కాస్త స్థలం ఇవ్వకుండా కప్పేయడంతో చినుకు పడినా ప్రవహించే వీల్లేక రోడ్లు ముంపునకు గురవుతున్నాయి.



హైవే స్థలాన్నీ వాడేస్తున్నారు

బోరవానిపాలెం డంపింగ్‌యార్డు జంక్షన్ వద్ద, మారికవలస వద్ద హైవేను ఆనుకుని కూడా ప్రైవేటు వ్యక్తులు తమ సొంత స్థలాలకు ప్రభుత్వ స్థలాలు, గెడ్డ, హైవే స్థలాల్లో నుంచి బహిరంగంగా రోడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులు ఆధీనంలోకి వెళ్లిపోతున్నాయి. మధురవాడలో ఇలాంటివి తరచూ జరుగుతున్నా రెవెన్యూ, జీవీఎంసీ, హైవే అథారిటీ అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇలానే వదిలేస్తే కోట్లు విలువ చేసే భూములు అక్రమార్కుల స్వాధీనంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తుప్పలు తొలగించి ఆక్రమణకు యత్నం


ఆక్రమణకు సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి

పరదేశిపాలెం సర్వే నం.32లో మూడు కోట్లపైనే విలువ చేసే సుమారు 30 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు రంగం సిద్ధం చేస్తున్నారు. మొదట ఇందులోనే నర్సరీ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించగా.. సాక్షిలో కథనం తర్వాత రెవెన్యూ అధికారులు స్పందించినా.. నామ మాత్రపు చర్యలు చేపట్టి వదిలేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. హైవే, ప్రభుత్వ గెడ్డ భూమిని సదరు వ్యక్తులు తుప్పలు తొలగించి ఆక్రమణకు సిద్ధం చేస్తున్నారు. పది రోజుల పై నుంచి ఈ తతంగం జరుగుతున్నా కింది స్థాయి సిబ్బంది, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పక్కనే ఉన్న ఉన్న ఓ ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి ఆ స్థలంలో నుంచే రోడ్డు ఏర్పాటు చేశారు.


పరదేశిపాలెంలో హెచ్చరిక బోర్డు తీసేసి రహదారి ఏర్పాటు

గెడ్డ స్థలాన్ని కప్పేశారిలా..

పాత పరదేశిపాలేనికి సమీపంలో టైల్స్ వ్యాపార సంస్థ, దాని ఎదురుగా ఉన్న ఓ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు కూడా గెడ్డలు నామరూపాలు లేకుండా కప్పేశారు. దీంతో రోడ్డు మీదనే వర్షం నీరు ప్రవహిస్తోంది.

- పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో ఆర్‌జీకే కొత్త కాలనీ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు కూడా కోట్లు విలువ చేసే హైవేను ఆనుకుని ఉన్న గెడ్డ, నేషనల్ హైవే అథారిటీకి చెందిన భూములను కొందరు వ్యక్తిగత, వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాడుకుంటూ, వాటిలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


మారికవలస వద్ద ప్రైవేట్ వ్యక్తులు వాడుకుంటున్న హైవే, ప్రభుత్వ భూమి

రక్షణ చర్యలు తీసుకుంటాం

పరదేశిపాలెం నుంచి కొమ్మాది వరకు హైవేను ఆనుకుని ఉన్న హైవే, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. హైవే అధికారులతో కలసి భూముల రక్షణకు చర్యలు చేపడతాం.

– పాల్‌కిరణ్, తహసీల్దారు, విశాఖ రూరల్ మండలం

క్లుప్తంగా

స్కేటింగ్‌లో అక్కాతమ్ముళ్లకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన కార్తీక శరణ్య, రోహిత్‌రెడ్డి

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీకి చెందిన అక్కాతమ్ముళ్లు బొల్లెంకుల కార్తీక శరణ్య, లోహిత్‌రెడ్డి ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 5 నుంచి 10 వరకు కోయంబత్తూర్ (పొలాచీ)లో జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2024లో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా వీరిని కోచ్‌లు చిట్టిబాబు, సత్యనారాయణ, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

భీమునిపట్నం: ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్, బాల్‌రంగ్ పోటీల్లో స్థానిక నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో థింసా నృత్య విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో సంగీత వాద్యాల విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి అభినందించారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతి అంశాల్లోనూ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలి


అవంతి విద్యాసంస్థలలో విద్యార్థులు, అధ్యాపకులతో భీమిలి ఎస్ఐ గౌరి

తగరపువలస: యువతులు, మహిళలకు విద్యాసంస్థలలో సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని భీమిలి ఎస్ఐ ఎన్.గౌరి సూచించారు. ఇందుకు విద్యార్థులు, అధ్యాపకులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మహిళా సాధికారత, లైంగిక వేధింపులపై చెరకుపల్లి అవంతి విద్యాసంస్థలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సమస్యల పట్ల అవగాహన, సున్నితత్వం గురించి తెలియజేశారు. లైంగిక వేధింపులపై జీరో టాలరెన్స్ విధానం, సమస్యలపై అవగాహన కల్పించారు. వీటిని మహిళా సాధికారిత సెల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ రాజేశ్వరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జేవీ అగ్రహారంలో రెవెన్యూ సదస్సు


వినతులు స్వీకరిస్తున్న డీటీ శ్రీనుబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం సచివాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ శ్రీనుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 19 ఫిర్యాదులు అందాయి. వీటిలో 22ఏ తొలగింపు, ఎండోమెంట్, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ ప్రాంతంలో ప్రచారం అంతగా లేకపోవడంతో, కొంతమందితో ఈ సదస్సు ముగించేశారు.

ఆశ్రమం పేరుతో అక్రమాలంటూ ఫిర్యాదు

- ఏసీపీ విచారణ


పోలీస్ స్టేషన్ వద్ద సత్యనారాయణ కుటుంబ సభ్యులు, అహం బ్రహ్మాస్మి నిర్వాహకురాలు

పీఎం పాలెం: ఆశ్రమం పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు నార్త్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు పీఎం పాలెం పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ తెలిపిన వివరాలివి.. మధురవాడ శివశక్తి నగర్‌లోని ఓ ఇంట్లో అహం బ్రహ్మాస్మి పేరుతో గురుమాత సహస్ర ఓ సంస్థ ఏర్పాటు చేశారు. పాత డెయిరీ ఫాం ఏరియాలో నివసిస్తున్న ఉడతా సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులు కూడా అందులో చేరారు. అయితే, అందులో చేరినప్పటి నుంచి తన భార్య, పిల్లలు గురుమాత సహస్ర చెప్పుచేతల్లోకి వెళ్లిపోయారని, తనను దూరంగా పెడుతున్నారంటూ సత్యనారాయణ గురుమాతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర సీపీ ఆదేశాల మేరకు విశాఖ నార్త్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు బుధవారం అహం బ్రహ్మాస్మి నిర్వాహకురాలు గురుమాత సహస్రను విచారించారు. తమ సంస్థ ఎటువంటి అక్రమాలు చేయడం లేదని, అన్నదానం వంటి కార్యక్రమాలు దాతల విరాళాలతో చేస్తున్నామని ఆమె వివరణ ఇచ్చారు. అలాగే సత్యనారాయణ కుటుంబ సభ్యులు వారి ఇష్ట ప్రకారమే ఉంటున్నారని, వారి స్వేచ్ఛాజీవితానికి అడ్డు తగలడం లేదని వివరించారు. మరలా ఎవరైనా ఇటువంటి ఫిర్యాదులిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ఆమెను హెచ్చరించారు. సత్యనారాయణకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జ్యూట్ మిల్లు కార్మికుల ఆందోళన


జ్యూట్ మిల్లు గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని నేరెళ్లవలసలోని గణేష్ జ్యూట్ మిల్లు కార్మికులు బుధవారం జ్యూట్ మిల్లు గేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ గణేష్ జ్యూట్ మిల్లును తెరవాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ నుంచి జ్యూట్ మిల్లును యాజమాన్యం మూసివేసి కార్మికులను రోడ్డు మీదకు నెట్టేశారన్నారు. కార్మికులకు పని చేసిన కాలానికి జీతం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అప్పలనాయుడు, వి.సూర్యనారాయణ, కె.ప్రశాంత్, ఐఎఫ్‌టీయూ నాయకులు నమ్మి కృష్ణ, వి.జగదీష్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

14న ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

పద్మనాభం: మండలంలోని ఏడు సాగు నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులను ఎన్నుకునేందుకు ఈ 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసి, పోలింగ్ స్టేషన్లలో అంటించారు. పొట్నూరు నూకాంబిక, మద్దిరాజు వెంకటపతిరాజు చెరువు, పాండ్రంగి కాటమయ్య చెరువు, కోరాడ కృష్ణంరాజు, గంధవరం నరసింహరాజు, కర్రి వాని, పెంట గుండం చెరువు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ గ్రామాల్లోని పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు బుధవారం పరిశీలించారు.

‘బాకివీధికి వసతులు కల్పించండి’


శిథిలమైన బాకి వీధి డ్రైనేజీ, సీసీ రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస గణేష్ థియేటర్ వెనుక బాకివీధికి వసతులు కల్పించాలని అక్కడివారు కోరుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం వెలంపేట నుంచి ఈ వీధికి వేసిన సీసీ రోడ్డు, డ్రైనేజీలు ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడమే తప్ప, సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తమకు రాకపోకలు సాగించేందుకు ఉన్న ఏకైక మార్గం శిథిలమైందని, దానిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం


విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన తీగలు

కొమ్మాది: కాపులుప్పాడ పరిధి గంభీరం గెడ్డ వద్ద గల విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకుని ప్రమాదకర స్థితిలో ఉంది. వర్షం పడే సమయంలో ఈ విద్యుత్ స్తంభం నుంచి మంటలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక విద్యుత్ స్తంభాల పరిస్థితి ఇలాగే ఉందని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మరింత మెరుగైన ర్యాంక్ సాధించాలి


విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో–2 జయప్రద

తగరపువలస: విద్యాశాఖ ఇటీవల ప్రతి పాఠశాలకు స్టార్ ర్యాంకులు ప్రకటించిందని భీమిలి ఎంఈవో–2 ఎ.జయప్రద తెలిపారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట పాఠశాలలో జరుగుతున్న సమ్మెటివ్–1 పరీక్షల నిర్వహణను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టార్ ర్యాంక్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఓవరాల్‌గా పాఠశాలకు 3 స్టార్ ర్యాంకు వచ్చిందని, ఇంకా కృషి చేసి ఫైవ్ స్టార్ ర్యాంకు సాధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4వ వార్డులో సమస్యలపై కౌన్సిల్‌లో ప్రస్తావన


కౌన్సిల్‌లో సమస్యలు ప్రస్తావిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులోని పలు సమస్యలపై జీవీఎంసీ కౌన్సిల్‌లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం ప్రస్తావించారు. రామాద్రి బీచ్ రోడ్డు వద్ద 8 ఏళ్లుగా మత్స్యకారులు నిర్వహించుకుంటున్న దుకాణాలను ముందస్తు సమాచారం లేకుండా తొలగించారని, దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. మంచి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు పది సంవత్సరాలు నిండితే జీతం పెంచుతామన్న నేపథ్యంలో 4వ వార్డులో 25 మంది ఉద్యోగులకు కూడా జీతం పెంచే విధంగా సహకరించాలన్నారు. వార్డు ఏర్పడి 5 సంవత్సరాలే అయినా, ఇక్కడ చేస్తున్న ఉద్యోగులు గతంలో పంచాయతీ పరిధిలో కూడా విధులు నిర్వహించిన నేపథ్యంలో వారికి కూడా జీతాలు పెంచాలని కోరారు.

20, 21 తేదీల్లో అవంతిలో టెక్నికల్ ఫెస్ట్


టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 20, 21 తేదీలలో జ్ఞాన్–2కె24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను కళాశాలలో బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌లో సాంకేతిక నైపుణ్య కార్యక్రమాలతో పాటు, పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, టెక్నికల్ క్విజ్, టెక్నికల్ యాక్టివిటీస్, విద్యార్థుల వినూత్న ఆలోచనలు నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే ఇలాంటి ఫెస్ట్‌కు చుట్టుపక్కల కళాశాలల విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. ముగింపు కార్యక్రమం సమయంలో సాంకేతిక కార్యక్రమాల విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, డైరెక్టర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైభవంగా గీతా జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో హరేకృష్ణ వైకుంఠం


గీతాపారాయణ చేస్తున్న విద్యార్థులు

- ఆకట్టుకున్న శ్లోకాల పారాయణం

తగరపువలస: గీతాజయంతిని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో గీతా శ్లోక పారాయణం చేయించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు భగవద్గీతలోని 18 అధ్యాయాలకు చెందిన 700 శ్లోకాలు పారాయణం చేశారు. కార్యక్రమంలో ఎస్ఇంట్, సరస్వతీ విద్యావిహార్, వెంకట్ విద్యాపీఠ్, విజ్ఞాన విహార్, వాగ్దేవి విద్యాలయం, విద్యాసాగర్, శ్రీకృష్ణ గ్రామర్, థెరిసా, శ్రీవిద్య పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు. విద్యార్థులకు అంబరీష దాస స్వామి ప్రశంసాపత్రాలు అందించారు. చిన్నారులు లయబద్ధంగా చేసిన గీతా పారాయణం చూసి భక్తులు ముగ్ధులయ్యారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత మృతి

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన పోతిన వెంకటలక్ష్మి (51) కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఈ మేరకు మృతురాలి భర్త శ్రీను ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివి.. కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్న వెంకటలక్ష్మి, ఎన్ని మందులు వాడినా నొప్పి తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. ఈ మేరకు మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన ఆమె బుధవారం స్థానిక వ్యవసాయభూమి వద్ద మూలుగుతూ కనిపించింది. దీంతో భర్త శ్రీను ఆమెకు సపర్యలు చేసి, సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె పురుగుల మందు తాగి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త శ్రీను ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడుకు ఫిర్యాదు చేయగా, ఏఎస్ఐ నూకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛభారత్‌లో ఆదివాసీ యువత


రుషికొండలో జరిగిన స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న యువత

కొమ్మాది: జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో భాగంగా ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో బుధవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. తీరం వెంబడి ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. సహజ వనరులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు గొర్లె మహేశ్వరరావు, వెంకట ఉజ్వల్, ఆదివాసీ యువత పాల్గొన్నారు.